భూములిచ్చిన రైతులకు న్యాయం చేస్తాం!


- సీతారామ నిర్వాసితుల సమస్యలపై సీఎం దృష్టికి తీసుకెళ్తా..
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ



దమ్మపేట, నవంబరు 14(ప్రజాజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం కోసం భూములు ఇచ్చి నష్టపోయిన నిర్వాసితుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు.దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో శనివారం ఉదయం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సీతారామ ప్రాజెక్టు

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 15 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 8



మణుగూరు పట్టణంలోని భగత్ సింగ్ నగర్ లో నిర్మాణంలో ఉన్న నీటి ట్యాంక్ చుట్టూ ఇప్పుడు పెద్ద రచ్చ నడుస్తోంది. ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వం కేటాయించిన కోట్లాది రూపాయలు సద్వినియోగం అవుతున్నాయా, లేక చేతులు మారుతున్నాయా అన్న చర్చ జోరుగా సాగుతోంది. ట్యాంక్ కట్టే తీరు చూసిన ప్రతి ఒక్కరూ ముక్కున వేలేసుకుంటున్నారు. వార్తలు వచ్చినా, ఫిర్యాదులు చేసినా, పట్టించుకునే వారే లేకపోవడం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. నాణ్యత విషయంలో రాజీ పడుతున్నారని, అధికారుల మౌనం వెనుక ఏదో మతలబు ఉందని జనం గుసగుసలాడుకుంటున్నారు. అసలు ఇది ప్రజల కోసం కడుతున్న ట్యాంకా, లేక కొందరి జేబులు నింపడానికి కడుతున్న కట్టడమా అన్న ప్రశ్న ఇప్పుడు పట్టణం మొత్తం మారుమోగుతోంది. ఈ నేపథ్యంలోనే ట్యాంక్ నిర్మాణంలో జరుగుతున్న లోపాలపై పూర్తి వివరాల్లోకి వెళ్దాం.

వాటర్ ట్యాంక్ దాహార్తి తీర్చేదేలా...!

2 లో..

- 2 కోట్ల 28 లక్షల ట్యాంక్ నాణ్యత చచ్చుబడ్డదా... • క్వాలిటి లేదు..! తనిఖీలు లేవు..!! నిర్మాణమంతా ఉట్టి గుల్లే... • అధికారుల కళ్ల ముందే దోపిడీ.. పర్సంటేజీల కోసమే ఈ మౌనమా..? • అసలు ట్యాంక్ కడుతున్నారా.. లేక ప్రజాధనం తినేస్తున్నారా..?



కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్‌కు పచ్చజెండా..!

- సుజాతనగర్ లో 667 ఎకరాల్లో ఎయిర్ పోర్ట్..
- భద్రాద్రి ఆకాశంలో విమానాలు..! ఇక కొత్తగూడెం నుంచే విమాన ప్రయాణం...
- 6 చోట్ల సర్వే.. ఫైనల్ గా సుజాతనగర్ కే ఓటు...
- తెలంగాణలో 5వ ఎయిర్ పోర్ట్ గా కొత్తగూడెం...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. నవంబర్ 14, ప్రజాజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల చిరకాల స్వప్నం సాకారం కానుంది. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర విమానయాన శాఖ పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించిందని తెలుస్తోంది. దీంతో జిల్లా మొత్తం సంబరాల్లో మునిగిపోయింది.జిల్లాలోని సుజాతనగర్ వద్ద సుమారు 667 ఎకరాల్లో ఈ విమానాశ్రయాన్ని నిర్మించనున్నారు. పెనగడప, పాల్వంచ–

మిగతా 2 లో...

సెప్టిక్ ట్యాంకులు నిండిన సోయిలేని శ్రీ చైతన్య స్కూల్ యజమాన్యం

- కనీస అర్హత లేని టీచర్ల నిర్వాహకమే నిర్లక్ష్యానికి ప్రధాన కారణమా!



లక్ష్మీదేవి పల్లి, నవంబర్ 14, ప్రజాజ్యోతి: లక్ష్మీదేవి పల్లి మండలం ప్రశాంతి నగర్ కాలనీలో శ్రీ చైతన్య స్కూల్లోని సెప్టిక్ ట్యాంకులు నిండిపోయి వాష్ రూమ్ వాటర్ ద్వారా రోడ్డు మీదకు వచ్చి నిలువ ఉండిపోయింది దీనివలన రాకపోకలకు అంతరాయం కలుగుతుంది అని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు వాసన వలన ఇంట్లో ఉండడానికి కూడా ఇబ్బందికరమైన వాతావరణం నెలకొంటుందని పలుమార్లు స్కూలు యజమాన్యానికి కంప్లీట్ ఇచ్చిన పట్టించుకునే నాధుడు లేడు. ఈ సమస్య మూడు నెలల నుంచి ఉన్నది అయినా కొంచెం కూడా కదలిక రావట్లేదు అంటే స్కూల్ యాజమాన్యనిర్వాహకం ఎట్లాంటిదో అర్థమవుతుందని కాలనీవాసులు చెప్తున్నారు ఇప్పటికైనా ఈ పత్రిక సమాచారం ద్వారా అయినా మా మా గోడు విని ఈ స్కూల్ యజమాన్యంపై

మిగతా 2 లో...

సంక్షేమ పథకాలు అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం



- ప్రతి ఇంటికి కుటుంబ భీమాను సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లందు, నవంబర్ 14 (ప్రజాజ్యోతి) సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం, వాటిని పకడ్బందీగా అమలు చేయడం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయే విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో సీఎం రేవంత్ రెడ్డి ప్రతి ఇంటికి కుటుంబ బీమా పథకాన్ని ఈనెల 19వ తేదీన ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి కుటుంబ భీమా పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఇంటికి కుటుంబ భీమా సంక్షేమ పథకాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబాన్ని

మిగతా 2 లో...

వాటర్ ట్యాంక్ దోపిడీకి హద్దే లేదా..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, నవంబర్ 14 (ప్రజాజ్యోతి) : భగత్ సింగ్ నగర్‌లో నిర్మాణంసాగుతున్న(వాటర్‌ట్యాంక్)నీటి నిల్వ కేంద్రం వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. నాసిరక నిర్మాణం జరుగుతున్న అధికారులకు మాత్రం చలనం లేకపోవడం స్థానికుల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది. తప్పును కనీసం సరిదిద్దుకుందామన్న ఆలోచన కూడా నిర్మాణదారుడికి లేకపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నాణ్యతను పట్టించుకునే వారే లేరని, కలపాల్సిన మిశ్రమం కలపకుండా, ఉంచాల్సిన సమయం ఉంచకుండా పనులు చకచకా సాగిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కంటికి కనిపించే లోపాలను కూడా చూడనట్టు వదిలేస్తున్నారని, ఈ తీరు చూస్తే ఆ కట్టడం ఎన్నాళ్లు నిలుస్తుందోనన్న భయం పట్టుకుందని అక్కడి జనం అంటున్నారు. పనితీరు గురించి అడిగిన వారిని అడ్డదిడ్డంగా మాట్లాడి పంపిస్తున్నారన్న ఆరోపణ ఉంది.

క్వాలిటీ లేదు..! తనిఖీలు లేవు..!! నిర్మాణమంతా ఉట్టి గుల్లే...

ఇక మున్సిపాలిటీ తీరుపై మాట్లాడితే ముద్దొస్తుందని స్థానిక ప్రజలంటున్నారు. పట్టణంలోనే జరుగుతున్న ఈ వ్యవహారం గురించి తమకు తెలియదన్నట్టు వ్యవహరిస్తున్నారని, ఒక్కసారైనా వచ్చి పరిశీలించిన పాపాన పోలేదని విమర్శిస్తున్నారు. తనిఖీ చేయాల్సిన వారే తనిఖీకి రాకపోతే ఇక నాణ్యత ఎవరు చూస్తారని నిలదీస్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన కార్యాలయం చేతులు ముడుచుకు కూర్చోవడంతో నిర్మాణదారుడు రెచ్చిపోతున్నాడని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే పట్టణంలో మరో మాట గుప్పుమంటోంది. నిర్మాణదారుడి నుంచి కొన్ని పచ్చ నోట్లు అందుతుండటం వల్లే అధికారులు నోరు మెదపడం లేదన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పైసలు చేతులు మారితేనే ఫైళ్లు కదులుతాయని, బిల్లులు మంజూరు అవుతాయని కొందరు బహిరంగంగానే చర్చిస్తున్నారు. నిజానిజాలు ఏమిటో తేలాలంటే ఉన్నతాధికారులు రంగంలోకి దిగాల్సిందేనని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణం పూర్తి కాక ముందే ఇంత ఆరోపణలు వస్తున్నాయంటే, పూర్తయ్యాక పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని నిర్మాణ పనులు పరిశీలించి, లోపాలు జరిగాయని తేలితే నిర్మాణదారుడిని నల్ల జాబితాలో చేర్చడంతో పాటు బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమ పథకాలు అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి...)

అదుకోవాలని సదుద్దేశంతో ఇప్పటికే ఉచిత బియ్యం నూతన రేషన్ కార్డుల మంజూరు, ఉచిత బస్సు ప్రయాణం, ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, 200యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇలా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మన్ననలను కాంగ్రెస్ ప్రభుత్వం పొందుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రజల ఆశీర్వాదాలతో కొలువుతీరిన ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల వారికి ఉపయోగపడే అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయని, అసలు ఆ పథకాలు అమలుకు జాప్యం ఎందుకయిందో ప్రజలకు తెలుసని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజా రంజక పాలన కొనసాగిస్తున్న ప్రజా ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసిన ప్రజలు వాటిని నమ్మేస్థితిలో లేరని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు పేరుతో ప్రారంభించిన ఉపాధి హామీ పథకం పేరును మార్చి బిజెపి ప్రభుత్వం తమ నిరంకుశ పాలనకు నిదర్శనంగా నిలిచిందని విమర్శించారు. రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే లక్ష్యంగా రైతు భరోసా, బోనస్, రుణమాఫీ ప్రకటించి రైతులను ఆదుకుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 19న ప్రారంభమయ్యే కుటుంబ భీమా పథకాన్ని ప్రతి ఇంటికి చేరేలా సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ప్రతి కుటుంబం కుటుంబ బీమా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారుల సూచనలను పాటించాలని తెలిపారు. ఈనెల 19న ఈ పథకానికి సంబంధించి విధివిధానాలు రావడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ యదలపల్లి అనసూయ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పులిగళ్ళ మాధవరావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోళ్ల సూర్యం, మండల రాము, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, మాజీ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఎయిర్ పోర్ట్ కు పచ్చజెండా..!

(మొదటి పేజీ తరువాయి...)

దమ్మపేట, చాపరాలపల్లి, దుమ్ముగూడెం, సుజాతనగర్, సీతంపేట అంటూ ఆరు ప్రాంతాల్లో భూమి లభ్యత, రన్ వే, ఎత్తు పరిమితి, అటవీ ప్రాంతాలు, వరద పరిస్థితులపై క్షుణ్ణంగా సర్వేలు నిర్వహించారు. చివరకు అన్ని విధాలా సుజాతనగర్ అనువుగా ఉంటుందని తేల్చారు. ప్రతిపాదిత ఎయిర్ పోర్ట్ నుంచి ప్రధాన రహదారి 3.4 కిలోమీటర్లు, కొత్తగూడెం రైల్వే స్టేషన్ 5.7 కిలోమీటర్లు, భద్రాచలం 35.4 కిలోమీటర్లు, సింగరేణి ప్రాంతం 32.3 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అభయారణ్యం 7.4 కిలోమీటర్ల దూరంలో ఉంది. 1986, 2022లో వచ్చిన భారీ వరదలకు కూడా 23 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉండటంతో ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. కేంద్రం నుంచి అనుమతి రావడంతో ఇక భూసేకరణ, ఇతర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇప్పటికే వరంగల్ మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాల పనులు మొదలవగా, ఇప్పుడు కొత్తగూడెంతో కలిపి శంషాబాద్, బేగంపేటతో రాష్ట్రంలో విమానాశ్రయాలు 5కు చేరనున్నాయి. ఈ ఎయిర్ పోర్ట్ వస్తే జిల్లాలో పరిశ్రమలు, వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, భద్రాచలం పర్యాటకం మరింత అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి, పరిశ్రమలకు, విద్యార్థులకు, వ్యాపారులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని అంటున్నారు.

భూములిచ్చిన రైతులకు న్యాయం చేస్తాం!

(మొదటి పేజీ తరువాయి...)

భూ నిర్వాసితులు కలిశారు. మండలంలోని మొండి వరై 10వ ప్యాకేజీ కింద భూములు కోల్పోయిన బాధిత గ్రామస్థులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలను మంత్రికి వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ విలువైన భూములను త్యాగం చేసినప్పటికీ భూసేకరణ, పరిహారం, పునరావాస ప్యాకేజీలకు సంబంధించి పలు సమస్యలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయని తెలిపారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న తమకు తగిన న్యాయం చేయాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. నిర్వాసితుల సమస్యలను సావధానంగా విన్న మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించారు. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మొండి వరై 10వ ప్యాకేజీ భూ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సాంకేతిక, పరిహార సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడతానని స్పష్టం చేశారు. ప్రభుత్వపరంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుని సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి సానుకూలంగా స్పందించడంతో భూ నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండలానికి చెందిన సీనియర్ నాయకులు, కాసాని నాగప్రసాద్, దొడ్డ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధన

- రాజాపురం శ్రీ చైతన్య విద్యాలయంలో బాలల దినోత్సవ వేడుకలు





అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 14, (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల రాజాపురం గ్రామంలోని శ్రీ చైతన్య విద్యాలయంలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ప్రత్యేకంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణా రెడ్డి మాట్లాడుతూ బాలల దినోత్సవ ప్రాముఖ్యత, పిల్లల హక్కులు, విద్య యొక్క ఆవశ్యకతను వివరించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను పోషిస్తూ తమ బోధనా నైపుణ్యాలను ప్రదర్శించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని తెలిపారు.

పేద వృద్ధులకు అండగా సుధా హెర్బల్ ట్రస్ట్

- 16 మంది పేదలకు స్వెటర్ల పంపిణీ



దమ్మపేట, నవంబరు 14(ప్రజాజ్యోతి): చలికాలంలో వృద్ధులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు కొనకళ్ల సుధారాణి సూచించారు. శనివారం దమ్మపేట మండలం నల్లివారిగూడెం గ్రామంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో 16 మంది పేద వృద్ధులకు స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ ప్రాంత గ్రామాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటోందని, వృద్ధులు శరీరానికి తగిన వెచ్చదనం కల్పించుకోవాలని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో స్వెటర్లు కొనుగోలు చేయలేని పేద వృద్ధులను గుర్తించి ఈ సాయం అందించినట్లు పేర్కొన్నారు. చలికాలంలో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున కుటుంబ సభ్యులు వృద్ధులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని సూచించారు. వారిని భారంగా భావించకుండా బాధ్యతగా చూసుకోవాలని హితవు పలికారు. గతంలోనూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వెటర్లు పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. అనంతరం వృద్ధులతో మాట్లాడి ఆరోగ్యపరమైన సూచనలు చేశారు. సుధారాణికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సెప్టిక్ ట్యాంకులు నిండిన సోయి లేని శ్రీ చైతన్య స్కూల్ యజమాన్యం

(మొదటి పేజీ తరువాయి...)

చట్టపరమైన చర్యలు తీసుకొని కాలనీవాసులకు న్యాయం చేస్తారని భావిస్తున్నాము అదేవిధంగా రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డుపై నిలువ కాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని త్వరితగతిన ఈ సమస్య నుంచి విముక్తిని చేసి అనారోగ్య బారిన పడకుండా కాపాడాలని కాలనీవాసులు తెలిపారు ఈ సమస్య రెండు మూడు నెలల నుంచి జరుగుతున్న స్కూల్ యజమాని పట్టించుకోవట్లేదు అని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు రాకపోకలకు రోడ్లకు అంతరాయం కలిగించే విధంగా చేసి ఆరోగ్యపరంగా ఇబ్బందికరమైన వాతావరణ మునకు కారణమైన స్కూలు నిర్వాహకుడు మీద తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు!

- పాఠశాల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన 9, 10వ తరగతి విద్యార్థులు





దమ్మపేట, నవంబరు 14(ప్రజాజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని దమ్మపేటలోని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతులు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హెచ్.ఎం.టి. హేమలత ఆధ్వర్యంలో 9, 10వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారు. ప్రతి సబ్జెక్టుకు ఒక్కో విద్యార్థిని ఉపాధ్యాయుడిగా కేటాయించి తరగతులు నిర్వహించారు. కంప్యూటర్, ఆర్ట్స్, వ్యాయామం, క్రాఫ్ట్ వర్క్‌తో పాటు పాఠశాలలోని వివిధ విభాగాల బాధ్యతలను కూడా విద్యార్థులే నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా బోధన, పాఠశాల నిర్వహణలోని బాధ్యతలను విద్యార్థులు స్వయంగా తెలుసుకునే అవకాశం కల్పించారు. బాలల దినోత్సవ ముగింపు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఏపీఎంసీ చైర్మన్ ఎస్. శ్రీలత, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ఉత్తమ బోధకులుగా, సేవలందించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఇందిరా నగర్ కాలనీ మలుపులో ఇసుక కుప్పలు

- రెండు రోజులుగా రహదారిపై ఇసుకతో ప్రమాదాలకు ఆహ్వానం
- అధికారుల పర్యవేక్షణ ఏది
- మూగజీవాల మకాం రహదారిపైనే
- ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?
- మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు, స్థానిక కార్పొరేటర్‌కు కనిపించని ప్రమాదం



పాల్వంచ, నవంబర్ 14, ప్రజాజ్యోతి: భద్రాచలం నుంచి పాల్వంచకు వచ్చే ప్రధాన రహదారిపై ఇందిరానగర్ కాలనీ సమీపంలోని మలుపు వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. రహదారిపై సగం వరకు ఇసుక పేరుకుపోవడంతో వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. ఈ ఇసుక కుప్ప రెండు రోజులుగా రహదారిపై ఉన్నప్పటికీ తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. దీనికి తోడు ఇసుక కుప్పల వద్ద మూగజీవాలు సేద తీరుతూ రహదారికి అడ్డంగా కూర్చుంటుండటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉంది.మలుపు వద్ద రహదారిపై పేరుకుపోయిన ఇసుక వాహనదారులకు ముందుగా కనిపించకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వేగంగా వచ్చే ద్విచక్ర వాహనాలు, కార్లు ఇసుక కుప్పను సమీపించేవరకు గుర్తించలేని పరిస్థితి. ఒక్కసారిగా బ్రేకులు వేయాల్సి వచ్చినా, ఇసుకపై వాహనం అదుపుతప్పినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రహదారిపైనే పశువులు కూర్చుంటుండటంతో వాహనదారులకు మరింత ప్రమాదకరంగా మారింది.

రెండు రోజులుగా ఇసుక కుప్ప..

అధికారులకు కనిపించని ప్రమాదం!

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులారా.. రెండు రోజులుగా ప్రధాన రహదారిపై ఇసుక కుప్ప ప్రమాదకరంగా మారినా మీ పర్యవేక్షణ ఎక్కడ? ప్రమాదకర మలుపుల వద్ద రహదారి భద్రతను పట్టించుకునే బాధ్యత లేదా? రహదారిపై ఇసుకను తొలగించడానికి ప్రమాదం జరిగే వరకు వేచి చూస్తారా? ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నా ఎందుకు స్పందించడం లేదు?

స్థానిక కార్పొరేటర్ స్పందన ఏది?

ఇందిరానగర్ కాలనీ కార్పొరేటర్‌కు ఈ ప్రమాదకర పరిస్థితులు కనిపించడం లేదా? రెండు రోజులుగా ప్రజలు ఈ రహదారిపై ప్రయాణిస్తున్నప్పుడు వారి భద్రతపై బాధ్యత లేదా? రహదారిపై ఇసుక కుప్పలు, పశువుల సంచారంతో ప్రమాదాలు పొంచి ఉన్నా ఇప్పటివరకు చర్యలు ఎందుకు చేపట్టలేదు? ప్రజాప్రతినిధిగా సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాల్సిన అవసరం లేదా?

ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

రహదారిపై ఇసుకను తక్షణమే తొలగించాల్సిన అవసరం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? మూగజీవాలు రహదారిపైకి రాకుండా చర్యలు చేపట్టే బాధ్యత ఎవరిది? ప్రమాదకర మలుపుల వద్ద వాహనదారులకు హెచ్చరికలు ఏర్పాటు చేయడానికి ఇంకెంత సమయం పడుతుంది?

ఒకవేళ ఈ ఇసుక కుప్పల కారణంగా ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి ప్రాణాలు కోల్పోతే బాధ్యత ఎవరు వహిస్తారు? వాహనం ప్రమాదానికి గురై కుటుంబం రోడ్డున పడితే దానికి సమాధానం చెప్పేది ఎవరు? రెండు రోజులుగా ప్రమాదం పొంచి ఉన్నా స్పందించని అధికారులు, ప్రమాదం జరిగిన తర్వాతే మేల్కొంటారా?

ఇప్పటికైనా స్పందిస్తారా.. ప్రమాదం జరిగాకే మేల్కొంటారా?

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ఇందిరానగర్ కాలనీ కార్పొరేటర్ ఇప్పటికైనా స్పందించి రహదారిపై పేరుకుపోయిన ఇసుకను తక్షణమే తొలగించాలి. మూగజీవాల సంచారాన్ని నియంత్రించి వాహనదారులకు సురక్షితమైన ప్రయాణాన్ని కల్పించాలి.ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితులు కళ్లముందే కనిపిస్తున్నా స్పందించని అధికార యంత్రాంగం ప్రజలకు ఏ భరోసా ఇస్తోంది? రెండు రోజులుగా రహదారిపై ఇసుక కుప్ప ఉన్నా చర్యలు చేపట్టకపోవడానికి కారణం ఏమిటి? ప్రమాదం జరిగితేనే చర్యలు తీసుకునే విధానానికి స్వస్తి పలుకుతారా? లేక మరో ప్రమాదం జరిగే వరకు ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తారా?

జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు



ఇల్లందు, నవంబర్ 14 (ప్రజా జ్యోతి) పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 137వ జయంతి వేడుకలను శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధానమంత్రిగా, స్వాతంత్ర సమ్మర్ యోధుడిగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు మరచిపోలేనివన్నారు. జవహర్లాల్ నెహ్రూ జయంతి వేడుకలను బాలల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డకిరణ్ మిత్రదానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఆకాంక్ష వేదిక సమావేశం

- హామీలు నెరవేర్చాలని ఉద్యమకారుల డిమాండ్
- త్యాగాలకు గుర్తింపు ఎక్కడ..?
- ఐక్యంగా పోరాడాలని పిలుపు..!



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. నవంబర్ 14, (ప్రజా జ్యోతి): – తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన, త్యాగాలు చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల త్యాగాలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని కోరారు. ఉద్యమకారుల హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వలసాల వెంకట రామారావు, జీవీ, పున్నం భిక్షపతి, మధుసూదన్ రెడ్డి, దుగ్యాల సుధాకర్, గాండ్ల సురేష్, జాడి చొక్కా రావు, మెరుపు రవీంద్రనాథ్, సురేష్, దుస్సా సమ్మయ్య, కత్తి రాము, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెన్నాపురంలో వైద్య శిబిరం



చర్ల, నవంబర్ 14 (ప్రజా జ్యోతి): చర్ల మండలం సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చెన్నాపురం గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సందీప్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సాధారణ దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. జ్వరంతో వచ్చిన ముగ్గురికి ఆర్డీటీ పరీక్షలు నిర్వహించడంతో పాటు రక్త నమూనాలు సేకరించారు. శిబిరంలో మొత్తం 43 మంది ఓపీ సేవలు పొందారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, దోమల నివారణకు రోజూ దోమతెరలు ఉపయోగించాలని అవగాహన కల్పించారు. ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తిన వెంటనే ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు , ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు పి. సుబ్బారావు, టి. వరప్రసాద్, ఆశా కార్యకర్త ఎం. దేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిద్ధార్థ కళాశాలలో ఘనంగా బాలల దినోత్సవం

- విద్యార్థులే దేశ భవిష్యత్తు : ప్రిన్సిపాల్ అజయ్ కుమార్
- చిరునవ్వులతో నిండిన బాలల వేడుక
- ఆటపాటలతో హోరెత్తిన సిద్ధార్థ కళాశాల



మణుగూరు క్రైమ్, నవంబర్ 14 (ప్రజాజ్యోతి) : – మణుగూరులోని సిద్ధార్థ వొకేషనల్ జూనియర్ కళాశాలలో బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వల్లభనేని అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హార్ట్ ఫుల్ నెస్ ప్రతినిధి బాలకృష్ణ పాల్గొని విద్యార్థులకు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, సానుకూల ఆలోచనల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థుల కోసం వివిధ వినోదాత్మక కార్యక్రమాలు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సభాహత్, దీప్తి, హేమలత, రాజేశ్వరి, నర్సింహారావు, రష్మిత, నవ్య, వాసుదేవ్ తదితర అధ్యాపకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రపంచ వేదికపై పినపాక గళం

- గిరిజన గోసను అంతర్జాతీయ వేదికపై వినిపించిన ఎమ్మెల్యే పాయం
- హైదరాబాద్ లో కూర్చుని పినపాక అభివృద్ధిపై చర్చ
- 70 దేశాల ముందు తెలంగాణ మోడల్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. నవంబర్ 14, ప్రజాజ్యోతి సాధారణంగా ఢిల్లీ, హైదరాబాద్ లో జరిగే పెద్ద సదస్సుల్లో పినపాక పేరు వినిపించడం అరుదు. కానీ ఈసారి భారత్ సమ్మిట్ – 2026 లో పరిస్థితి మారింది. పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రపంచ ప్రతినిధుల మధ్య కూర్చుని గిరిజన ప్రాంతాల సమస్యలు, అభివృద్ధిపై గళం వినిపించారు. 70 దేశాల నుంచి వచ్చిన నేతలు, మేధావులు హైదరాబాద్ లోని హైటెక్స్ లో "నూతన ప్రపంచ నిర్మాణం" గురించి మాట్లాడుతుంటే..పాయం మాత్రం ఆ చర్చను మన ఊర్లకు అనుసంధానం చేశారు. అభివృద్ధి అంటే కేవలం నగరాల్లో భవనాలు కాదు.. అడవి బిడ్డలకు విద్య, వైద్యం, ఉపాధి అందడమే అసలైన అభివృద్ధి అన్న కోణాన్ని ఆయన అక్కడ ప్రస్తావించినట్లు తెలిసింది. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, యువత భవిష్యత్తు, వాతావరణ మార్పులు వంటి అంశాలపై జరిగిన చర్చల్లో తెలంగాణ సంక్షేమ మోడల్ ప్రత్యేకంగా నిలిచింది. ముఖ్యంగా ఎస్టీ సంక్షేమంలో తెలంగాణ అనుసరిస్తున్న విధానాలపై ఇతర దేశాల ప్రతినిధులు ఆసక్తి చూపారని సమాచారం. ఈ సమ్మిట్ ద్వారా పినపాక లాంటి మారుమూల నియోజకవర్గాల కు కూడా కొత్త ఆలోచనలు, కొత్త పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని స్థానికులు ఆశిస్తున్నారు. ప్రపంచ వేదికపై గిరిజన ఎమ్మెల్యే ఉండటమే పినపాకకు గర్వకారణమని పలువురు చెబుతున్నారు.



- కొందరి పంతుళ్ళను చెడగొడుతున్న మరో కొందరు పంతుళ్లు
- బడికి పోతే మస్టరే.. కానీ పాలసీలు చేస్తే లక్షలు అంటు ప్రోత్సాహం
- కుంటుపడుతున్న సర్కారు బడులు...?
- ఉపాధ్యాయులు లేరని విద్యార్థులు బడులకు రాని వైనం
- వచ్చిన విద్యార్థులను పాఠశాలకు రావద్దని ముందే చెప్పుతున్న కొందరు పంతుళ్లు
- ఇరు జిల్లాల డీఈఓల నిఘా ఏది.. చర్యలేవి

బడి వద్దు..! పాలసీలే ముద్దు..!!

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలో కొన్ని సర్కారు బడుల పరిస్థితి దయనీయంగా మారిపోయిందని చెప్పటకు నిదర్శనముగా నిలుచుచున్నది. ప్రభుత్వము కోట్లాది రూపాయలు వెచ్చించి విద్యావ్యవస్థను బాగు చేయుటకు శతవిధాల ప్రయత్నించుచుండగా, కొందరు ఉపాధ్యాయులు మాత్రము తమ కర్తవ్యమును విస్మరించి, బడిని విడిచి ప్రైవేటు వ్యాపారముల వెంట పరుగులు తీయుచున్నారను వార్తలు కలకలం రేపుతున్నాయి. బడికి పోతే జీతము మాత్రమే వస్తుందని, పాలసీలు చేస్తే లక్షలు గడించవచ్చునని కొందరు చెప్పుతూ , మరికొందరిని సైతము చెడగొట్టుచున్నారని తోటి టీచర్స్ వాపోతున్నారు. అధికారుల నిఘా కొరవడిన కారణము చేతనే ఈ దుస్థితి దాపురించినదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. నవంబర్ 14, ప్రజాజ్యోతి

సీఎం రేవంత్ రెడ్డి సర్కారు బడులను బాగు చేయడానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే, కొందరు టీచర్లు మాత్రం బడిని పట్టించుకోకుండా పాలసీలు,రియల్ ఎస్టేట్ వ్యాపారాల వెంట పరుగులు తీస్తూ ప్రభుత్వ ఆశయానికి దెబ్బ కొడుతున్నారన్న ఆరోపణలు ఇరు జిల్లాల్లో కలకలం రేపుతున్నాయి. ఇటీవల జరిగిన టాటా ఏఐజీ, ఎస్ బీఐ మీటింగ్ లో సుమారు 2000 మందికి పైగా పాల్గొనడమే ఇందుకు నిదర్శనమని విద్య మేధావులు మండిపడుతున్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగము లేక అలమటిస్తుంటే, ఉద్యోగం పొందిన కొందరు టీచర్స్ ఉద్యోగం లెక్కచేయక కుండా మండల, జిల్లా అధికారుల అండతో కలిసి ఇష్టానుసారముగా సంచరిస్తున్నారని పఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా తెలుస్తోంది.

›» సీఎం కలలకు గండికొడుతున్న కొందరు గురువులు

సర్కారు విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ నిధులు కేటాయిస్తూ, నూతన భవనాలు, సౌకర్యాలు సమకూరుస్తున్నా, క్షేత్రస్థాయిలో ఫలితం కనిపించడం లేదు. దీనికి కారణం బాధ్యత మరచిన కొందరు బోధకుల తీరేనని తల్లిదండ్రులు చెబుతున్నారు. తరగతి గదిలో ఉండాల్సిన సమయంలో బయటి పనుల్లో తిరగడం, విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోకపోవడం ఇప్పుడు సర్వసాధారణమైంది. ప్రభుత్వం అందిస్తున్న జీతం తీసుకుంటూనే, ప్రభుత్వ లక్ష్యానికి తిలోదకాలివ్వడం దారుణమని పలువురి నుంచి విమర్శలు వస్తున్నాయి. పేదకుటుంబాల పిల్లలు నమ్ముకున్న సర్కారు బడి ఇలా నిర్లక్ష్యానికి గురైతే, వారి చదువు ఏమవుతుందని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అందరూ ఇలా లేకపోయినా, కొందరి వల్ల మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు వస్తోందని కొందరు టీచర్లు కూడా వాపోతున్నారు. ఈ పరిస్థితిని గమనించి ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని ఇరు జిల్లాల నుంచి డిమాండ్ పెరుగుతోంది.



ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొందరు ఉపాధ్యాయులు బోధనను పక్కనపెట్టి బీమా పాలసీలు, స్థలాల వ్యాపారం, ఇతర ప్రైవేటు పనుల్లో బిజీ అయిపోయారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం హాజరు వేసుకుని, ఆ తర్వాత తరగతి గది వదిలి.. కమీషన్ వేటలో పంతుళ్లు

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కొందరు ఉపాధ్యాయులు బోధనను పక్కనపెట్టి బీమా పాలసీలు, స్థలాల వ్యాపారం, ఇతర ప్రైవేటు పనుల్లో బిజీ అయిపోయారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం హాజరు వేసుకుని, ఆ తర్వాత కొందరు ఏకంగా రేపటి నుంచి పాఠశాలకు రావొద్దని ముందే చెబుతున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఇది చదువు పట్ల పిల్లల్లో విరక్తిని పెంచుతోంది. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపాలన్నా, అక్కడ పరిస్థితి చూసి వెనకడుగు వేస్తున్నారు. ఈ అంశంపై మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తనిఖీలు, ఆకస్మిక సందర్శనలు లేకపోవడంతోనే ఈ అలసత్వం పెరిగిందని ఆరోపణలు వస్తున్నాయి. బాధ్యులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత చేయిదాటుతుందని తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు. వెంటనే నిఘా పెంచి, సర్కారు బడులను గాడిలో పెట్టాలని విద్యమేధావులు,విద్యార్థిసంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



›» పిల్లలు బడికి రావొద్దంటున్న వైనం..! అధికారులు ఏం చేస్తున్నారు..?

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు చదువుకు దూరమవుతున్న ఘటనలు ఇరు జిల్లాల్లో వెలుగు చూస్తున్నాయి. కొన్నిచోట్ల పిల్లలు బడికి వచ్చినా పాఠం చెప్పేవారు లేక వెనక్కి వెళ్తున్నారు. మరికొన్ని చోట్ల ఏకంగా రేపటి నుంచి పాఠశాలకు రావొద్దని ముందే చెబుతున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఇది చదువు పట్ల పిల్లల్లో విరక్తిని పెంచుతోంది. తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపాలన్నా, అక్కడ పరిస్థితి చూసి వెనకడుగు వేస్తున్నారు. ఈ అంశంపై మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తనిఖీలు, ఆకస్మిక సందర్శనలు లేకపోవడంతోనే ఈ అలసత్వం పెరిగిందని ఆరోపణలు వస్తున్నాయి. బాధ్యులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత చేయిదాటుతుందని తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు. వెంటనే నిఘా పెంచి, సర్కారు బడులను గాడిలో పెట్టాలని విద్యమేధావులు,విద్యార్థిసంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మారథాన్ పోస్టర్ ఆవిష్కరించిన డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి

- ప్రతిభగల క్రీడాకారులు కొత్తగూడెం జిల్లాలో ఉండటం జిల్లాకే గర్వకారణం
- డిప్యూటీ మేయర్ లలిత కుమారి

కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / నవంబర్ 14 ,(ప్రజా జ్యోతి) తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో, కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ పర్యవేక్షణలో డిసెంబర్ 6న భద్రాచలంలో నిర్వహించనున్న గోదావరి రివర్ మారథాన్‌ను విజయవంతం చేయాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి పిలుపునిచ్చారు.పాల్వంచ,శ్రీనివాస కాలనీ మినీ స్టేడియంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో గోదావరి రివర్ మారథాన్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ కొత్తగూడెం జిల్లాలో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు ఇలాంటి క్రీడా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. డిసెంబర్ 6న నిర్వహించే ఈ మారథాన్‌లో భాగంగా ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్‌తో పాటు 10K, 5K రన్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు, క్రీడాకారులు, యువత, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సీనియర్ క్రీడాకారుడు, తెలుగుదేశం నాయకుడు కనగాల అనంత రాములు మాట్లాడుతూ భద్రాచలంలో ఇలాంటి మారథాన్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని క్రీడాకారుల ప్రతిభకు మరింత గుర్తింపు లభించడంతో పాటు యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటారని తెలిపారు. మారథాన్ నిర్వాహకులను అభినందించారు.మారథాన్ నిర్వాహకుడు హరీష్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే సుమారు 1,000 మంది ఈ రన్‌లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. పాల్గొనే ప్రతి రన్నర్‌కు టీ-షర్ట్, ఫినిషర్ మెడల్ అందించడంతో పాటు బ్రేక్‌ఫాస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ కోచ్ నాగేందర్, టెన్నిస్ కోచ్ డేనియల్ రాంబాబు, ఆర్చరీ కోచ్ వంశీ, ఆర్గనైజర్ నిఖిల్,కాంగ్రెస్ నాయకుడు భద్రం, ఎంపీడీవో జముల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రెండో పంటకు సాగునీరివ్వాలి

- బిఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు

చర్ల, నవంబర్ 14(ప్రజా జ్యోతి): తాలిపేరు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో రెండో పంట సాగు చేయవద్దని రైతులకు సూచించడం వెనుక రాజకీయ ఎత్తుగడ ఉందని బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ కన్వీనర్ దొడ్డి తాతారావు తీవ్రంగా విమర్శించారు. చర్ల మండలం సత్యనారాయణపురంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు రైతులతో సమావేశం నిర్వహించి, తాలిపేరు ప్రాజెక్టు కింద రెండో పంట సాగు చేయవద్దని సూచించడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన అన్నారు.తాలిపేరు ప్రాజెక్టు నీటిని గోదావరిలోకి విడుదల చేసి ఖమ్మం వరకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతులు చర్చించుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలోని తాలిపేరు ప్రాజెక్టుపై ఎల్ నినో ప్రభావం ఉండదని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10 నాటికి వర్షాలు తగ్గిపోయినప్పటికీ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటితో రైతులు రెండు పంటలు సాగు చేసుకుంటున్నారని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా తాలిపేరు ప్రాజెక్టు నిండుకుండలా నీటితో ఉన్నప్పటికీ అధికారులపై ఒత్తిడి తెచ్చి రెండో పంట సాగు కాకుండా చేస్తున్నారని ఆరోపించారు.మరోవైపు చర్ల ప్రజలకు తాలిపేరు నీటితో తాగునీరు కూడా అందించడం లేదని విమర్శించారు. గోదావరిలో నీటి నిల్వలు పెంచే ప్రయత్నంలో స్థానిక రైతులకు రెండో పంట లేకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రెండో పంట సాగు చేయకపోతే ప్రజలు కిలో రూ.150 వరకు ధాన్యం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని, ఇప్పటికే ధరలు పెరిగి కిలో రూ.90కు చేరాయని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాల వల్లే రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ లో లేని కరువు తెలంగాణలో ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. తాలిపేరు నీటిని నిల్వ చేయకుండా ఆంధ్రప్రదేశ్ కు విడుదల చేయడం, కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయలేకపోవడం వల్ల భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో రైతులు, సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తాలిపేరు ప్రాజెక్టు నీటిని రెండో పంటకు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని దొడ్డి తాతారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయకపోతే రైతుల పక్షాన ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

- ఉపాధ్యాయ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి
- ఇంటర్ విలీనాన్ని స్వాగతిస్తున్నాం
- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయ వంతం చేయాలి: చావ రవి





భద్రాచలం, నవంబర్ 14 (ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డీఏలు, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో కొత్తగూడెంలో జరిగే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 7వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భద్రాచలంలో జిల్లా 6వ మహాసభలు జిల్లా అధ్యక్షుడు బి. మురళీమోహన్ అధ్యక్షతన ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న చావ రవి మాట్లాడుతూ ప్రభుత్వం పీఆర్సీ నివేదికను తెప్పించి వెంటనే ప్రకటించాలని, ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయుల పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈహెచ్ఎస్ పథకాన్ని సమర్థంగా అమలు చేసి, అందులోని సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ విలీనాన్ని స్వాగతిస్తున్నామని, అయితే అమలులో తలెత్తే విద్యారంగ, మౌలిక సమస్యలపై ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలతో ముందుగానే చర్చించాలని సూచించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, పీఆర్సీతో పాటు ఇతర సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు బి. రాజు, మల్లా రెడ్డి, జి. సమ్మారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా జేఏసీ చైర్మన్ ఏ. రామారావు, సర్పంచ్ పూనెం కృష్ణ, వార్డు సభ్యులు ఐ. అనసూయ, పి. లక్ష్మీనారాయణ, టీఎస్ యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వినూత్నంగా బాలల దినోత్సవ వేడుకలు



చర్ల, నవంబర్ 14 (ప్రజా జ్యోతి): చర్ల మండలంలోని తేగడ శ్రీ సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా వినూత్నంగా నిర్వహించారు. పిల్లల ఆనందమే లక్ష్యంగా నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు జంతువుల వేషధారణలతో సందడి చేయగా, ఆశీర్వాద వృక్షాలు, బహుమతులు, వివిధ ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ జంతువుల వేషధారణలతో అలరించారు. చిన్నారుల వేషధారణలు, వారి ఉత్సాహం అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రతి తరగతికి ప్రత్యేకంగా ఆశీర్వాద వృక్షాలను ఏర్పాటు చేసి అందంగా అలంకరించారు. తరగతి ఉపాధ్యాయులు విద్యార్థులకు వ్యక్తిగతంగా ఆశీస్సులు అందిస్తూ, వారిలోని మంచి లక్షణాలను ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత ఉన్నతంగా ఎదగడానికి అవసరమైన సూచనలను ప్రేమతో తెలియజేశారు. ప్రోత్సాహక సందేశాలతో కూడిన ప్రత్యేక కార్డులు, బహుమతులను అందజేశారు. అనంతరం నిర్వహించిన వివిధ వినోదభరితమైన ఆటల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకోవడానికి గల కారణాలను వివరించారు. నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టమని, దేశ భవిష్యత్తు చిన్నారుల చేతుల్లోనే ఉందని ఆయన విశ్వసించేవారని తెలిపారు. బాలల హక్కులు, విద్య, ఆనందం, సమగ్ర వికాసం ప్రాముఖ్యతను వివరించారు. ఉపాధ్యాయులు అరుణ, రాజేశ్వరి, పూజ, శ్రీదేవి, ప్రమీల, రమేష్, పాఠశాల డైరెక్టర్ లిఖిత విద్యార్థులు పాల్గొన్నారు.


ఘనంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు



భద్రాచలం, నవంబర్ 14 (ప్రజా జ్యోతి): భద్రాచలంలోని పాత ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కార్యాలయంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చంద్ర సుబ్బయ్య చౌదరి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నెహ్రూ జీవిత విశేషాలను వివరించారు. అనంతరం చంద్ర సుబ్బయ్య చౌదరి, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎల్.వి. ప్రసాద్, కోశాధికారి కృష్ణమూర్తి, సహాధ్యక్షులు ఎస్. రాజబాబు, టి. శివప్రసాద్ తదితరులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బందు నరసింహారావు, బైరు నరసింహారావు, శ్యామసుందర్, ఐటీడీఏ నరసింహారావు, రామరాజు, విష్ణుమొలకల సుబ్రహ్మణ్యం, రేపాక సత్యనారాయణ, పరిటాల సుబ్బారావు, చింతా రాధాకృష్ణ, కొండలరావు, నాళం సత్యనారాయణ, వి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలపై గిజిగాడు పక్షుల కళాత్మక గూళ్లు

► కట్టుగూడెంలో రైతు అజీమ్ వరి పొలంలో కనువిందు చేస్తున్న ప్రకృతి అద్భుతం



అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 14, (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండలంలోని కట్టుగూడెం గ్రామంలో రైతు అజీమ్‌కు చెందిన వరి పొలంలో గిజిగాడు పక్షులు నిర్మించిన అందమైన గూళ్లు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఎర్రగుంట విద్యుత్ కేంద్రం పరిధిలోని 11 కేవీ విద్యుత్ తీగలకు వేలాడుతున్న ఈ గూళ్లు ప్రకృతి అందాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సాధారణంగా చెట్ల కొమ్మలకు గూళ్లు నిర్మించుకునే గిజిగాడు పక్షులు, ఈ ప్రాంతంలో విద్యుత్ తీగలను ఆశ్రయించి గూళ్లు ఏర్పాటు చేసుకోవడం ఆసక్తిని కలిగిస్తోంది. ప్రకృతిలో అద్భుతమైన నిర్మాణ నైపుణ్యం కలిగిన పక్షులుగా పేరుగాంచిన గిజిగాడులు ఎండిన గడ్డి పోచలు, ఈత, తాటి ఆకుల పీచులతో పొడవుగా వేలాడే ఆకర్షణీయమైన గూళ్లను ఎంతో నేర్పుగా అల్లుకుంటాయి. గూడు నిర్మాణంలో చూపే నైపుణ్యం చూపరులను ఆశ్చర్యపరుస్తుంది. పక్షులు తమ గుడ్లు, పిల్లలకు రక్షణ కల్పించేలా గూళ్లను నిర్మించుకుంటాయి. చెట్ల సంఖ్య తగ్గడం, సహజ ఆవాసాల్లో మార్పులు వంటి కారణాలతో ప్రత్యామ్నాయ ప్రదేశాలను ఆశ్రయిస్తున్నట్లు భావిస్తున్నారు. ఒకే ప్రాంతంలో అనేక గూళ్లు కనిపిస్తుండటంతో అటుగా వెళ్లే రైతులు, గ్రామస్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. అయితే 11 కేవీ విద్యుత్ తీగలపై గూళ్లు ఉండటం వల్ల పక్షుల భద్రతతో పాటు విద్యుత్ ప్రమాదాల విషయంలోనూ సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ప్రారంభం

- భద్రాచలం, ఇల్లందు, అశ్వారావుపేటలో యువతకు అవకాశం
- భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్



భద్రాచలం, నవంబర్ 14 (ప్రజా జ్యోతి): రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు యువతకు నూతన ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో భద్రాచలం, ఇల్లందు, అశ్వారావుపేట యూత్ ట్రైనింగ్ సెంటర్లలో వ్యవసాయ డ్రోన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఐటీడీఏ పీవో బి. రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ద్వారా పంటలకు పురుగుమందులు, ఎరువులను తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయవచ్చని తెలిపారు. దీనివల్ల నీరు, మందుల వినియోగం తగ్గడంతో పాటు రైతులకు శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయన్నారు. పురుగుమందులతో రైతులకు ప్రత్యక్ష సంబంధం తగ్గి ఆరోగ్య భద్రతకు కూడా తోడ్పడుతుందని పేర్కొన్నారు. డ్రోన్ టెక్నాలజీపై ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పీవో సూచించారు. భద్రాచలం, ఇల్లందు, అశ్వారావుపేట యూత్ ట్రైనింగ్ సెంటర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9441390232 నంబరును సంప్రదించాలని తెలిపారు.

మావోయిస్టుల యంత్రాల డంప్ గుర్తింపు

♦ డ్రిల్లింగ్, వెల్డింగ్ యంత్రాలు సహా 22 రకాల పరికరాలు స్వాధీనం



చర్ల, నవంబర్ 14: (ప్రజా జ్యోతి): ఛత్తీస్ గఢ్ లోని నారాయణ్ పూర్ జిల్లాలో నక్సల్స్ ప్రభావం నుంచి విముక్తి లభించినప్పటికీ భద్రతా దళాలు అటవీ ప్రాంతాల్లో ముమ్మర గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో దుంగా, రేఖావాయ గ్రామాల అటవీ ప్రాంతంలో జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్ జీ) బలగాలు నిర్వహించిన గాలింపు చర్యల్లో భారీ సంఖ్యలో యంత్ర పరికరాలు, సాంకేతిక సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. నవంబర్ 13న నిర్వహించిన ఈ ఆపరేషన్ లో రెండు డ్రిల్ మెషీన్లు, రెండు వెల్డింగ్ మెషీన్లు, ఒక మోటార్, కట్టర్ మెషిన్, మూడు బ్లోయర్లు, ఒక బెంచ్ గ్రైండర్, ఒక టేబుల్ డ్రిల్ మెషిన్, రెండు టేబుల్ గ్రైండర్లు, రెండు వెల్డింగ్ హోల్డర్లు, 13 వైరింగ్ బోర్డులతో పాటు డ్రిల్ బిట్లు, టేప్ రెంచ్ లు, స్పానర్లు, వి-బెల్టులు, బెంచ్ వైస్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఇనుప వస్తువుల తయారీ, మరమ్మతులకు ఉపయోగించే పలు సాంకేతిక పరికరాలు కూడా లభ్యమయ్యాయి. జిల్లా ఎస్పీ సందీప్ కుమార్ పటేల్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీలు అజయ్ కుమార్, ఐశ్వర్య చంద్రకర్ మార్గదర్శకత్వంలో డీఎస్పీ మనోజ్ కుమార్ మాండవి నాయకత్వంలో ఈ గాలింపు చర్యలు చేపట్టారు. నక్సల్స్ ప్రభావం తగ్గిన ప్రాంతాల్లో శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలను అరికట్టేందుకు భద్రతా దళాలు నిరంతరం నిఘా, గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని నారాయణ్ పూర్ పోలీసులు వెల్లడించారు.



అదృశ్యమైన బాలిక.. కుంటలో మృతదేహం

- రాజ్య తండాలో విషాదం ... రాత్రంతా గాలింపు



ఇల్లెందు, నవంబర్ 14 (ప్రజా జ్యోతి)అమ్మమ్మ, తాతయ్యతో కలిసి ఉంటున్న చిన్నారి అదృశ్యమై చివరకు ఇంటి వెనుక ఉన్న కుంటలో శవమై కనిపించడంతో మామిడిగుండాల పంచాయతీ పరిధిలోని రాజ్య తండాలో విషాదం నెలకొంది. శుక్రవారం వ్యవసాయ పనులకు వెళ్లిన అమ్మమ్మ, తాతయ్య సాయంత్రం ఇంటికి వచ్చేసరికి చిన్నారి కనిపించకపోవడంతో గ్రామస్తుల సహకారంతో రాత్రంతా గాలించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ సురేష్ ఆధ్వర్యంలో గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ లభించలేదు. శనివారం ఇంటి వెనుక ఉన్న కుంటలో చిన్నారి మృతదేహం లభ్యమైంది. వ్యవసాయ పనులకు వెళ్లిన అమ్మమ్మ, తాతయ్యల కోసం వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు కుంటలో పడి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిలియంట్ విద్యాసంస్థలో అట్టహాసంగా బాలల దినోత్సవ వేడుకలు

- మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభా పాటవాల ప్రదర్శన

బూర్గంపహాడ్, నవంబర్ 14 (ప్రజా జ్యోతి):సారపాకలోని బ్రిలియంట్ విద్యా సంస్థలో బాలల దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.చిన్నారుల ఆటపాటలు,సాంస్కృతిక ప్రదర్శనలు,ఉత్సాహభరితమైన కేరింతలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా నిర్వహించిన మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌కు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమలోని సృజనాత్మకతను,ప్రతిభాపాటవాలను చాటుకున్నారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సారపాక గ్రామ ఉపసర్పంచ్ రమేష్‌హాజరయ్యారు.తొలుత భారత తొలి ప్రధాని,బాలల ఆప్తమిత్రుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు.ఉపసర్పంచ్ రమేష్‌మాట్లాడుతూ.. పిల్లలే దేశ భవిష్యత్తుకు పునాదులని,వారిలో దాగి ఉన్న అంతర్గత ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి వేదికలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లోనూ తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.మండలస్థాయిలో నిర్వహించే టాలెంట్ టెస్టులు,పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు,తమ సామర్థ్యాన్ని నిరూపించుకునేందుకు చక్కని అవకాశాన్ని కల్పిస్తాయన్నారు.ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని,దానిని గుర్తించి ప్రోత్సహించడం తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు,పాఠశాలక,సమాజానికి,దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు,గీతాలు,స్కిట్లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.చిన్నారులు తమలోని కళాత్మక నైపుణ్యాన్ని అద్భుతంగా ప్రదర్శిస్తూ సభికుల ప్రశంసలు అందుకున్నారు.ముఖ్యంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పాఠశాల ఆవరణ చిన్నారుల నవ్వులు,కేరింతలతో సందడిగా మారింది.ఈ సందర్భంగా నిర్వహించిన మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌తో పాటు వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులను అందజేశారు.విజేతలను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయ బృందం,ఉపసర్పంచ్ రమేష్,విద్యార్థుల తల్లిదండ్రులు,వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు,తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





నిమిషాలతో పోరాడి... యువతి మెదడును కాపాడిన భద్రాచలం ప్రభుత్వ వైద్యులు..!

- గోల్డెన్ అవర్‌లో అత్యాధునిక చికిత్సతో పక్షవాత
- బాధితురాలికి ఉపశమనం
- రూ.45 వేల విలువైన ఇంజెక్షన్ ఉచితంగా అందజేత





భద్రాచలం, నవంబర్ 14, (ప్రజా జ్యోతి): సకాలంలో స్పందించి అత్యాధునిక వైద్యం అందిస్తే ప్రాణాపాయ పరిస్థితులను అధిగమించవచ్చని మణుగూరు, భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య బృందాలు నిరూపించాయి. పక్షవాతానికి గురైన 29 ఏళ్ల యువతికి గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించి, చచ్చుబడిన కుడి చేయి, కాలి కదలికలను గణనీయంగా మెరుగుపరిచారు.

సత్వర గుర్తింపు.. నిమిషాలతో పోరాడి...! వేగవంతమైన చికిత్స

మణుగూరుకు చెందిన రజని (29)కు ఉదయం 10.30 గంటలకు మాట తడబడటం, కుడి చేయి, కాలు చచ్చుబడిపోవడం వంటి లక్షణాలు కనిపించాయి. కుటుంబ సభ్యులు ఆమెను మణుగూరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా, జనరల్ మెడిసిన్ వైద్యుడు డాక్టర్ సాయి కుమార్ పరిస్థితిని గుర్తించి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. మణుగూరు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రామకృష్ణ ముందుగానే భద్రాచలం వైద్యురాలు డాక్టర్ తేజస్వి గద్దెకు సమాచారం అందించడంతో అక్కడి వైద్య బృందం చికిత్సకు సిద్ధమైంది.

టెనెక్టెప్లేజ్ ఇంజెక్షన్‌తో మెరుగైన ఫలితం

భద్రాచలం ఆసుపత్రిలో సీటీ స్కాన్ నిర్వహించగా మెదడులో రక్తస్రావం లేదని నిర్ధారణ అయింది. లక్షణాలు ప్రారంభమైన నాలుగున్నర గంటల చికిత్సా వ్యవధిలోనే ఉండటంతో వైద్య అర్హతలను పరిశీలించి మధ్యాహ్నం 2 గంటలకు రక్తపు గడ్డను కరిగించే అత్యాధునిక టెనెక్టెప్లేజ్ ఇంజెక్షన్ అందించారు. దీంతో చికిత్సకు సానుకూల స్పందన లభించి, కుడి చేయి, కాలికదలికలు మెరుగుపడ్డాయి.కండరాల శక్తి 0/5 స్థాయి నుంచి 4+/5 స్థాయికి చేరింది. ప్రస్తుతం యువతి వైద్యుల పర్యవేక్షణలో ఉంది.

గోల్డెన్ అవర్ ఎంతో కీలకం

పక్షవాతం వచ్చిన తొలి నాలుగున్నర గంటలను గోల్డెన్ విండోగా పరిగణిస్తారు. ఈ సమయంలో అర్హులైన రోగులకు రక్తనాళాల్లోని గడ్డలను కరిగించే చికిత్స అందిస్తే మెదడు దెబ్బతినడాన్ని, దీర్ఘకాలిక వైకల్యాన్ని తగ్గించవచ్చు. ముఖం వాలిపోవడం, చేయి లేదా కాలు బలహీనపడటం, మాట తడబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు.

రూ.45 వేల ఇంజెక్షన్ ఉచితంగా

బహిరంగ మార్కెట్లో సుమారు రూ.45 వేల విలువ చేసే టెనెక్టెప్లేజ్ ఇంజెక్షన్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందించడం విశేషం. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారి డాక్టర్ జి. రవి బాబు రెండు ఆసుపత్రుల వైద్యులు, నర్సింగ్, ఆరోగ్య సిబ్బందిని అభినందించారు. వైద్యుల సమయస్ఫూర్తి, ఆసుపత్రుల మధ్య సమన్వయం, సిబ్బంది అంకిత భావంతోనే మెరుగైన ఫలితం సాధ్యమైందన్నారు.మారుమూల ప్రాంతాల్లోనూ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఆధునిక వైద్య సేవలు అందించగలమని ఈ ఘటన నిరూపించింది.

వైభవంగా శ్రీ బాలాజీ కల్యాణం

- అన్నప్రసాదం అందించిన పుల్లయ్య-సత్యవతి దంపతులు





అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 14, (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి గ్రామంలో కొలువైన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణ వేడుకను భక్తిప్రపత్తులతో జరిపించారు. ఈ వేడుకకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని పాల్వంచ వాస్తవ్యులు ఆంగోత్ పుల్లయ్య–సత్యవతి దంపతులు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేసి అన్నప్రసాద వితరణ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు. భక్తులకు సౌకర్యవంతంగా అన్నప్రసాదం అందేలా సిబ్బంది సహకరించారు.

బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు క్రికెట్ పోటీలు

- ప్రగతి మైదానంలో క్రీడా సందడి
- చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపిన వన్‌టౌన్ సీఐ జితేందర్

కొత్తగూడెం, నవంబర్ 14, ప్రజాజ్యోతి : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం క్రికెట్ అకాడమీ నిర్వాహకులు పంతంగి సాయి నిరంజన్ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో చిన్నారులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ సముద్రాల జితేందర్ చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. చిన్నారులు తమలోని ప్రతిభను గుర్తించి క్రీడారంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడా పోటీలు నిర్వహించడం చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందిస్తుందని నిర్వాహకులు తెలిపారు.



ఇరవెండిలో పిల్లల సమస్యలపై ప్రత్యేక గ్రామ సభ

- సమస్యల పరిష్కారానికి సర్పంచ్ హామీ!
- చిన్నారుల సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చిన విద్యార్థిని ప్రసన్నలక్ష్మి



బూర్గంపహాడ్, నవంబర్ 14 (ప్రజాజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ, విద్య, ఆరోగ్యం, భద్రతతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇరవెండి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం పిల్లల ప్రత్యేక గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సభలో చిన్నారులు, కిశోర బాలికలు తమ సమస్యలను, అవసరాలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ గ్రామ సభకు గ్రామ సర్పంచ్ గుండి బాబురావు అధ్యక్షత వహించగా, ఉప సర్పంచ్ రామారావు, వార్డు సభ్యులు, గ్రామంలోని పిల్లలు, కిశోర బాలికలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా, ఏఎన్ఎం సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కుమారి ప్రసన్నలక్ష్మి పిల్లల తరఫున సభలో మాట్లాడుతూ గ్రామంలో చిన్నారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. పాఠశాలల్లో మెరుగైన మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని కోరారు. అదేవిధంగా సాయంత్రం వేళల్లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, పిల్లలు ఆడుకునేందుకు అనువైన ఆట స్థలం ఏర్పాటు చేయాలని, చదువుకునేందుకు చిన్న గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే సమయంలో మార్గమధ్యంలో కోతులు విద్యార్థులపైకి ఎగబడుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయని, వాటిని పట్టించి పిల్లలకు రక్షణ కల్పించాలని అధికారులను కోరారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదని, చిన్న వయసులో పెళ్లిళ్లు చేయకుండా ప్రతి ఒక్కరూ పిల్లల చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని 'చిన్నవయసులో పెళ్లి వద్దు.. చదువే ముద్దు' అంటూ తన అభిప్రాయాన్ని స్పష్టంగా వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ గుండి బాబురావు, ఉప సర్పంచ్ రామారావు మాట్లాడుతూ పిల్లలు సభలో ప్రస్తావించిన సమస్యలను పంచాయతీ తీర్మానాల్లో పొందు పరిచి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలోని పిల్లల విద్య, ఆరోగ్యం, భద్రతకు గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ సమస్యలను ధైర్యంగా, స్పష్టంగా సభ ముందుంచిన విద్యార్థిని ప్రసన్నలక్ష్మిని వారు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి స్పందన సభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల సిబ్బందితో బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ, పిల్లల సంక్షేమానికి సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. పిల్లల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే సంకల్పంతో ప్రత్యేక గ్రామ సభ ముగిసింది.

బాలల భవిష్యత్తుకు మత్తు పదార్థాలు ముప్పు

- మత్తు పదార్థాల రహిత గ్రామంగా దమ్మపేటను తీర్చిదిద్దాలి
- బాలల దినోత్సవంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు పిలుపు



దమ్మపేట, నవంబరు 14(ప్రజాజ్యోతి): బాలల భవిష్యత్తును కాపాడేందుకు మత్తు పదార్థాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని దమ్మపేట గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు పిలుపునిచ్చారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచి ఆంగోతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులంటే ఎంతో ఇష్టపడే నెహ్రూ జన్మదినమైన నవంబరు 14ను బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. బాలలే దేశ భవిష్యత్తు అని, వారిని మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంపై ఉందన్నారు. గ్రామంలో మత్తు పదార్థాల విక్రయాలు, సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు పంచాయతీ చేసిన తీర్మానాలను పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించారు. ఎక్కడైనా నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలు, సరఫరా జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూడాలని సభ్యులకు సూచించారు. మత్తు పదార్థాల రహిత గ్రామ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొల్లు దుర్గారావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, పసుమర్తి కుసుమాంబ, చిన్నశెట్టి నాగలక్ష్మి, సిబ్బంది మహాదేవ సాయి, కుప్పాల విజయ్, భీమా శ్రీనివాసరావు, కాకాని గణేష్, గ్రామస్థుడు చిన్నశెట్టి ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై జరిగిన హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

- బీసీ ఉద్యమ నాయకుడిని అంతమొందించే కుట్ర జరిగిందా?
- సమగ్ర విచారణ జరపాలి
- తీన్మార్ మల్లన్నకు తక్షణమే జెట్ ప్లస్ భద్రత కల్పించాలి

పాల్వంచ, నవంబర్ 14(ప్రజా జ్యోతి): తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై జరిగిన హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పార్టీ అధ్యక్షులు మల్లెల వీరనారాయణ తెలిపారు. శనివారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అన్నాజీపూర్ గ్రామ సమీపంలో బీసీ రాజ్యాధికార పాదయాత్ర నిర్వహిస్తున్న తీన్మార్ మల్లన్న కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని లారీతో అతివేగంగా ఢీకొట్టడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. బీసీ రాజ్యాధికార పాదయాత్రను అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే ఈ దాడికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. గతంలో ఇదే భువనగిరి ప్రాంతంలో బీసీల హక్కుల కోసం పోరాడిన మారోజు వీరన్న, బెల్లి లలిత, సాంబశివుడు వంటి ఉద్యమకారులపై జరిగిన దాడులు, హత్యలను గుర్తుచేస్తూ, అదే తరహాలో బీసీ ఉద్యమ నాయకుడు తీన్మార్ మల్లన్నను కూడా అంతమొందించే కుట్ర జరిగిందా అనే కోణంలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపించాలని, దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. తీన్మార్ మల్లన్నకు ఎలాంటి ప్రాణహాని కలగకుండా తక్షణమే జెట్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్నకు ఏదైనా ప్రాణహాని జరిగితే బీసీ ఉద్యమ శ్రేణులంతా తీవ్రంగా స్పందిస్తారని, బీసీ రాజ్యాధికార సాధన కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉంటామని మల్లెల వీరనారాయణ స్పష్టం చేశారు. ఆకిరెడ్డి శ్రీనివాస్ – జిల్లా ప్రధాన కార్యదర్శి, అటికేటి శంకర్ – పాల్వంచ పట్టణ అధ్యక్షులు, మల్లెల నాగమణి – పాల్వంచ పట్టణ మహిళా అధ్యక్షురాలు, వట్టికోట రామకృష్ణ – బూర్గంపాడు మండల అధ్యక్షులు, విలాసాగరం కోటేశ్వరరావు – అశ్వాపురం మండల అధ్యక్షులు, మంద ఉమామహేశ్వరరావు – సుజాతనగర్ మండల యూత్ అధ్యక్షులు, రష్మిక – సుజాతనగర్ సోషల్ మీడియా కన్వీనర్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నేడు పూసుకుంటలో మంత్రి తుమ్మల పర్యటన

- ఎమ్మెల్యే జారెతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి





దమ్మపేట, నవంబరు 14(ప్రజాజ్యోతి): మండల పరిధిలోని పూసుకుంట గ్రామంలో ఆదివారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు గ్రామానికి చేరుకోనున్న మంత్రి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి గ్రామంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు, పత్రికా విలేకరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్దేశిత సమయానికి హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాసాని నాగప్రసాద్ కోరారు.

పాల్వంచ 38వ డివిజన్‌లో నూతన పెన్షన్ల మంజూరు

- లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్లు పంపిణీ చేసిన కార్పొరేటర్ బత్తుల మధుచంద్



పాల్వంచ, నవంబర్ 14, ప్రజాజ్యోతి: పాల్వంచ పట్టణంలోని 38వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్లకు సంబంధించిన ప్రొసీడింగ్ ఆర్డర్లను కార్పొరేటర్ బత్తుల మధుచంద్ పంపిణీ చేశారు. కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి శనివారం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్లను అందజేశారు. 38వ డివిజన్‌లో అర్హులైన పేదలకు నూతన పెన్షన్లు మంజూరు కావడానికి కార్పొరేటర్ బత్తుల మధుచంద్ చేసిన కృషి, చొరవ కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు. పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కార్పొరేటర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్న కార్పొరేటర్‌ను డివిజన్ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రజలు, నూతన పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

మేరా యువ భారత్ యూత్ వాలంటీర్‌గా చామకూరి సాయి వంశీ గౌడ్ ఎంపిక

- పాల్వంచ–లక్ష్మీదేవిపల్లి బ్లాక్‌కు వాలంటీర్‌గా అవకాశం



పాల్వంచ, నవంబర్ 14, ప్రజాజ్యోతి: యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేయడం, వారి ప్రతిభను వెలికితీయడం లక్ష్యంగా మేరా యువ భారత్ – ఖమ్మం ఆధ్వర్యంలో పాల్వంచకు చెందిన చామకూరి సాయి వంశీ గౌడ్‌ను పాల్వంచ–లక్ష్మీదేవిపల్లి బ్లాక్ మేరా యువ భారత్ యూత్ వాలంటీర్‌గా ఎంపిక చేశారు. యూత్ క్లబ్ ద్వారా ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతలో చైతన్యం తీసుకురావడానికి సాయి వంశీ గౌడ్ చేసిన కృషిని గుర్తించి ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు. సాయి వంశీ గౌడ్ మాట్లాడుతూ, మేరా యువ భారత్ యూత్ వాలంటీర్‌గా తనను ఎంపిక చేసిన మేరా యువ భారత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ యువత అభివృద్ధికి, సామాజిక సేవా కార్యక్రమాలకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ధరణి రికార్డుల్లో భూ అక్రమాల కలకలం!

- వారసత్వ భూముల్లో అక్రమ మ్యుటేషన్లు జరిగాయా?
- కుటుంబ సభ్యుల అనుమతి లేకుండానే మూడు ఎకరాలు ఒకరి పేరునకు మార్పు చేశారంటూ ఆరోపణలు
- పాత పహాణీల్లో మార్పులు.. తెల్లకాగితాలపై సంతకాలు, వేలిముద్రలతో భూ బదలాయింపులా?
- అప్పటి వీఆర్ఏ పాత్రపైనా విచారణ జరపాలి.. బాధితుడు శనగల లక్ష్మయ్య డిమాండ్

సుజాతనగర్, నవంబర్ 15 (ప్రజాజ్యోతి ప్రత్యేక ప్రతినిధి): తరతరాలుగా వారసత్వంగా వస్తున్న భూములపై రెవెన్యూ రికార్డుల్లో జరిగిన మార్పులు ఓ కుటుంబంలో తీవ్ర ఆందోళనకు దారితీశాయి. కుటుంబ సభ్యులందరి సమ్మతి లేకుండానే సుమారు మూడు ఎకరాల భూమిని ఒకరి పేరునకు మార్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాత పహాణీల్లోని వివరాలను పక్కనపెట్టి, తెల్లకాగితాలపై తీసుకున్న సంతకాలు, వేలిముద్రల ఆధారంగా మ్యుటేషన్లు చేపట్టారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం నిమ్మలగూడెం కాలనీకి చెందిన బాధితుడు శనగల లక్ష్మయ్య ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



›» మూడు ఎకరాలు ఒకరి పేరుమీద ఎలా మారింది?


తమ తాత శనగ అచ్చయ్య, తండ్రి పరమయ్య కాలం నుంచి కుటుంబానికి వారసత్వంగా వస్తున్న భూములపై నలుగురు అన్నదమ్ములకు హక్కులు ఉన్నాయని లక్ష్మయ్య తెలిపారు. అయితే కుటుంబ సభ్యులందరి హక్కులను పరిశీలించకుండా, వారి సమ్మతి తీసుకోకుండా సుమారు మూడు ఎకరాల భూమిని ఒకరి పేరునకు మార్చినట్లు అయన ఆరోపిస్తున్నారు. అసలు మ్యుటేషన్కు దరఖాస్తు చేసింది ఎవరు? కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చారా? వారి అంగీకారం తీసుకున్నారా? భూమి బదలాయింపునకు ఆధారాలేమిటి? అనే ప్రశ్నలకు రెవెన్యూ అధికారులు రికార్డుల ఆధారంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

›» తెల్లకాగితాలపై వేలిముద్రలు.. మ్యుటేషన్ ఎలా?

కుటుంబ సభ్యుల నుంచి కొన్నిచోట్ల సంతకాలు, మరికొన్నిచోట్ల వేలిముద్రలు తీసుకున్నారని, అయితే వాటిని ఏ ప్రయోజనం కోసం వినియోగించారో తమకు తెలియదని లక్ష్మయ్య ఆరోపిస్తున్నారు. తెల్లకాగితాలపై తీసుకున్న సంతకాలు, వేలిముద్రల ఆధారంగా భూముల హక్కుల్లో మార్పులు జరిగాయా? అన్న కోణంలో విచారణ జరగాలని కోరుతున్నారు. మ్యుటేషన్ సమయంలో సమర్పించిన అసలు దస్త్రాలు, అంగీకార పత్రాలు, వారసత్వ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి నిజానిజాలు బయటపెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

›» పాత పహాణీలకు.. ప్రస్తుత రికార్డులకు పొంతన లేదా?

సర్వే నంబర్లు 1084, 1073, 1109, 1090, 1089లకు సంబంధించిన భూముల విషయంలో పాత పహాణీల్లో నమోదైన విస్తీర్ణానికి, తదుపరి రెవెన్యూ రికార్డుల్లో చూపిన వివరాలకు వ్యత్యాసాలు ఉన్నాయని బాధితుడు ఆరోపిస్తున్నారు. ఐదు కుంటల భూమిని పది కుంటలుగా చూపించారా? వాస్తవ విస్తీర్ణానికి భిన్నంగా రికార్డులు నమోదు చేశారా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు. 1950 దశకం నుంచి ఇప్పటివరకు భూముల హక్కుల చరిత్రను పరిశీలించి పాత పహాణీలు, ప్రస్తుత రికార్డులను పోల్చాలని డిమాండ్ చేస్తున్నారు.



›» అప్పటి వీఆర్ఏ పాత్రపై విచారణ జరపాలి!

భూముల రికార్డుల్లో మార్పులు జరిగిన సమయంలో విధులు నిర్వహించిన అప్పటి వీఆర్ఏ పాత్రపైనా విచారణ జరపాలని లక్ష్మయ్య కోరుతున్నారు. మ్యుటేషన్ ప్రక్రియలో ఎవరు కీలకంగా వ్యవహరించారు? పాత రికార్డులను ఎవరు పరిశీలించారు? కుటుంబ సభ్యుల సమ్మతి లేకుండానే మార్పులకు ఎలా అనుమతి లభించింది? అనే అంశాలను వెలికితీయాలన్నారు. అప్పటి వీఆర్ఏతో పాటు సంబంధిత రెవెన్యూ సిబ్బందిని విచారించి, అసలు మ్యుటేషన్ దరఖాస్తులు, అనుమతి పత్రాలు, సంతకాలు, వేలిముద్రలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



›» 2016–17 మ్యుటేషన్లపై సమగ్ర దర్యాప్తు చేయాలి

2016–17లో జరిగిన భూ రికార్డుల మార్పులు, మ్యుటేషన్ ప్రక్రియను మొదటి నుంచి చివరి వరకు పరిశీలించాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నారు. దరఖాస్తు వివరాలు, నోటీసుల జారీ, విచారణ, అధికారుల అనుమతులు, డిజిటల్ నమోదులన్నింటినీ తనిఖీ చేయాలన్నారు. అవసరమైతే ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులందరి వాంగ్మూలాలు నమోదు చేయాలని కోరుతున్నారు.

›» మా భూములు మాకు దక్కేలా చూడాలి!

ఇప్పటికే పలుమార్లు అధికారులను సంప్రదించినప్పటికీ తమకు న్యాయం జరగలేదని శనగల లక్ష్మయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అర్హులైన వారసుల భూమి హక్కులను పరిరక్షించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. “తరతరాలుగా మా కుటుంబానికి చెందిన భూములు మా ప్రమేయం లేకుండా ఒకరి పేరునకు ఎలా మారాయి? మూడు ఎకరాల భూమి బదలాయింపునకు ఆధారాలే మిటో అధికారులు వెల్లడించాలి. పాత పహాణీలు, మ్యుటేషన్ దస్త్రాలు, సంతకాలు, వేలిముద్రలను పరిశీలించి నిజానిజాలు నిగ్గుతేల్చాలి. మా భూములు మాకు దక్కేలా ప్రభుత్వం న్యాయం చేయాలి” అని బాధితుడు శనగల లక్ష్మయ్య కోరుతున్నారు.

బాలల విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతుల కల్పన
- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కక్కిరాల రమేష్

దమ్మపేట, నవంబరు 14(ప్రజాజ్యోతి): బాలలతోనే దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యమిస్తోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కక్కిరాల రమేష్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం దమ్మపేట మండల కేంద్రంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో ఆయన ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పలకలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కక్కిరాల రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ కార్పొరేట్ స్థాయి వసతులు, ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే పథకాన్ని అమలు చేస్తోందన్నారు. విద్యా వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుడుతూ 10+2 విద్యా విధానాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, చదువుతోపాటు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పిట్టల శ్రీనివాసరావు, అన్నవరపు నాగేంద్రరావు, ఉపాధ్యాయురాలు నాగమణి, అంగన్ వాడీ టీచర్ గోళ్ళ సీతారావమ్మ తదితరులు పాల్గొన్నారు.



బిర్సా ముండా, సోయం గంగులు విగ్రహాల ప్రతిష్ఠాపనకు సన్నాహాలు

- పూర్తి సహకారం అందిస్తా : సర్పంచ్ పూనెం కృష్ణ

భద్రాచలం, నవంబర్ 14 (ప్రజా జ్యోతి): ఆదివాసీ మహాయోధులు భగవాన్ బిర్సా ముండా, కోయ బెబ్బులి సోయం గంగులు విగ్రహాల ప్రతిష్ఠాపనకు భద్రాచలంలో సన్నాహాలు ముమ్మరమయ్యాయి. ఈ మేరకు గిరిజన అభ్యుదయ సంఘ భవనంలో పూనెం వీరభద్రం అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ పూనెం కృష్ణ గ్రామపంచాయతీ తరపున సంపూర్ణ సహకారంతో పాటు వ్యక్తిగత ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించారు. మాజీ జెడ్పీటీసీ కుంజా ధర్మారావు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం బిర్సా ముండా సాగించిన పోరాట స్ఫూర్తిని భావితరాలకు చాటాలని పిలుపునిచ్చారు. నవంబర్ 15న బిర్సా ముండా జయంతి వేడుకలతో పాటు విగ్రహాల ప్రతిష్ఠాపనకు భూమిపూజ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.



ఎర్రగుంటలో అయ్యప్ప స్వామి పడిపూజ

- పడిపూజకు విచ్చేసిన శ్రేయస్ మీడియా అధినేత గండ్ర శ్రీనివాస్

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 14, (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమానికి శ్రేయస్ మీడియా అధినేత గండ్ర శ్రీనివాస్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప స్వాములకు పంచెలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లెల నరసింహారావుతో పాటు పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.



భారత్ సమ్మిట్ లో పాల్గొన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ





దమ్మపేట, నవంబరు 14(ప్రజాజ్యోతి): హైదరాబాద్ లోని నోవాటెల్ హోటల్లో నిర్వహించిన భారత్ సమ్మిట్ లో భాగంగా 'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' పేరుతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారుతున్న పరిస్థితులు, నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అభివృద్ధి అవకాశాలు, భవిష్యత్తు ప్రపంచ నిర్మాణంలో వివిధ రంగాల పాత్ర తదితర అంశాలపై ఈ సమ్మిట్ లో చర్చించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు అవసరమైన నూతన ఆలోచనలు, భవిష్యత్తు ప్రణాళికలు, వివిధ రంగాల్లో చోటుచేసుకుంటున్న మార్పులపై జరిగిన చర్చలు ఈ కార్యక్రమానికి ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.